ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 8 అక్టోబరు 2025





సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన

వలంటీర్లలా పనిచేయలేం

- పీ-4 కార్యక్రమాల అమలులోనూ అలక్ష్యం
- సూపర్ జీఎస్టీపై ఇంటింటి ప్రచారానికి దూరం
- రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీలోనూ తీవ్ర నిర్లక్ష్యం
- సూపర్ సిక్స్ డిమాండ్లు అమలు చేయాలని డిమాండ్

సచివాలయ కార్యదర్శుల పోరుబాట



నరసరావుపేట మునిసిపాల్టీలోని సచివాలయం

ప్రభుత్వం చెప్పినట్లుగా గతంలో వలంటీర్లు పని చేసినట్లు మేము పనిచేయలేం.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయలేం.. అంటూ సచివాలయాల కార్యదర్శులు కార్యాలయాలకే పరిమిత మవుతు న్నారు. కేవలం సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అది కూడా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందచేయకుండా తమ వద్దకే వారందరినీ పిలిపించుకుని పంపిణీ చేస్తున్నారు. పీ4 కార్యక్రమాల అమల్లో కూడా వారు పాల్గొనడంలేదు. గత నెలలో రేషన్ స్మార్ట్‌కార్డుల పంపిణీ చేపట్టి.. లబ్ధిదారులకు వాటిని ఇళ్ల వద్ద అందజేయాలని సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం ఆదేశించింది. అదేవిధంగా ప్రస్తుతం సూ పర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ఇంటింటా ప్రచార బాధ్యతలను కూడా సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. స్మార్ట్ రేషన్ కార్డులను కొన్ని దగ్గర్ల డీలర్లకు అప్పగించగా.. మరికొన్ని ప్రాంతా ల్లో కార్యాలయాలకు వచ్చిన కార్డుదారులకు మాత్రమే అంద జేస్తున్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ లబ్ధి ప్రజలకు అందా లని.. జీఎస్టీ తగ్గింపు ఫలాలపై మోసపోకుండా ప్రజలను చైతన్య వంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలను రూపొందించాయి. అయితే ఆయా పనులతో తమకు సంబంధం లేదన్నట్లుగా సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. సూపర్ సిక్స్ డిమాండ్లు అమలు చేయాలంటూ ఇంతకాలం పరోక్ష ఉద్యమం చేస్తున్న సచివాలయ కార్య దర్శులు ప్రత్యక్ష పోరుకు సిద్ధమవుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వలంటీర్లలా ఇంటింటికి వెళ్లం.. వారు నిర్వహించినట్లుగా విధులు నిర్వహించం.. అంటూ సచివాలయాల కార్యదర్శులు పరోక్ష ఉద్యమం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన వాట్సాప్ గ్రూపుల నుంచి వారు వైదొలిగారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరిట ప్రభుత్వం పిలుపు ఇచ్చిన ఇంటింటి ప్రచార కార్యక్రమాల్లో కార్యదర్శులు పాల్గొనడంలేదు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కూడా చేయడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమాలకు కూడా మున్సిపాల్టీల్లో, పంచాయతీల్లో ఉద్యోగులు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. సచివాలయ విధులకు మాత్రమే వారు పరిమితమవుతున్నారు. వలంటీర్లుగా తమను ఇంటింటికి తిప్పడం సరికాదని కార్యదర్శులు పేర్కొంటున్నారు. వలంటీర్లు చేసిన పనులు తమకు అప్పగించడం సరికాదంటున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దాదాపు 20 సర్వేలు నిర్వహించామని తెలిపారు. తమకు కేటాయించిన విధులు మాత్రమే నిర్వహిస్తామని, సర్వేలు వంటి కార్యక్రమాలకు హాజరు కాలేమని వారు తేల్చిచెబుతున్నారు. మున్సిపాల్టీల్లో జరిగే పలు కార్యక్రమాలకు కూడా వారు గైర్హాజరవుతున్నారు. సూపర్ జీఎస్టీ ప్రచార కార్యక్రమాలకు సచివాలయ కార్యదర్శులు దూరంగా ఉండటంతో మెప్మా సిబ్బందితో అధికారులు నిర్వహిస్తున్నారు.

డిమాండ్ల సాధన కోసం పోరుబాట

సూపర్ సిక్స్ డిమాండ్ల సాధన పేరుతో ఈ నెల 10 నుంచి ఉద్యమంలోకి వెళ్లాలని యూనియన్ నేతలు చర్చలు జరుపుతున్నారు. సూపర్ సిక్స్ డిమాండ్లపై ఇప్పటికే వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తలపించే రీతీలో సచివాలయ ఉద్యోగులు సూపర్ సిక్స్ డిమాండ్లు అమలు చేయాలని కోరుతున్నారు. ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూ రు చేయాలని, ప్రొబెషనరీ బకాయిలు చెల్లించాలని, ఆరేళ్లు ఒకే పోస్టులో సర్వీసు పూర్తిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, మాతృశాఖల్లో విలీనం చేయాలని, అర్హతకి తగిన ఉద్యోగో న్నతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎస్ఎస్ఎంలకు పెంచిన విధంగా కార్యదర్శులందరికీ జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగుల సూపర్ 6 డిమాండ్స్

1. వాలంటీర్ విధుల అయినటువంటి ఇంటింటి సర్వేల నుండి విముక్తి.
2. నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు
3. ప్రొబేషనరీ సమయంలో రావాల్సిన బకాయిలు
4. 6 సంవత్సరాల ఒకే పోస్టులో సర్వీసు పూర్తిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు
5. ఏయే శాఖల ఉద్యోగులు లను వారి మాతృశాఖలో విలీనం
6. అర్హతకి తగిన promotion ఛానెల్ క్రియేట్ చేసి సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్ కల్పించాలి.

కౌలు రైతులకు రుణాలు అందించాలి


- ప్రతి నెలా రెండు సార్లు రుణ మేళాలు నిర్వహించాలి
- బ్యాంకర్ల సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు అందరికీ బ్యాంకులు రుణాలు అందజేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు బ్యాంకర్లకు సూచించారు. ప్రతీ నెలా రెండు సార్లు రుణమేళాలు నిర్వహించాలని తెలిపారు. సరికొత్త ఆలోచనలతో వ్యాపారాలు నిర్వహించాలనుకునే ఔత్సాహికులకు రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించాలని చెప్పారు. స్వయం సహాయ సంఘాల్లోని మహిళలకు శిక్షణతో పాటు రుణాలు మంజూరు చేస్తే వారు అద్భుతాలు సృష్టించగలరన్నారు. కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా అందించే సబ్సిడీలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు బ్యాంకర్లు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎల్‌డీఎం కేఏస్ రామ్‌ప్రసాద్, నాబార్డు డీడీఎం శరత్, వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు, ఉద్యాన అధికారి వెంకట్రావు, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, పంచాయతీరాజ్, పరిశ్రమల శాఖల అధికారులు నాగేశ్వరరావునాయక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న సాగర్ గేట్లు

22 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్ జలాశయానికి వరద నీరు చేరుతోంది. దీంతో ఇటీవల మూసేసిన సాగర్ గేట్లు మంగళవారం మళ్లీ తెరుచుకున్నాయి. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,29,950 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 22 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నీటిమట్టం 589.70 అడుగులు ఉంది. కుడి కాల్వ ద్వారా 10,040, ఎడమ కాల్వ ద్వారా 8022, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,170, 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 1,77,518, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, మొత్తం ఔట్‌ఫ్లో 2,29,950 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


22 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రేతాత్మలతో ఉపాధి పనులు

- మృతులు, గ్రామంలో లేని వారి పేరిట నిధుల డ్రా
- బొల్లాపల్లి ప్రజావేదికలో బహిర్గతమైన ఉపాధి అవినీతి

బొల్లాపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎప్పుడో మరణించిన వారు.. గ్రామంలో అందుబాటులో లేని వారు.. వచ్చి ఉపాధి పనులు చేసిన వింత బొల్లాపల్లి మండలంలో చోటుచేసుకుంది. అంటే ప్రేతాత్మలతో ఉపాధి సిబ్బంది పని చేయించారా అని పలువురు విస్తుపోతున్నారు. మృతులు, గ్రామాల్లో లేని వారి పేర్లపై ఉపాధి నగదు చెల్లింపులతో పాటు మొక్కలు లేకుండానే ఉన్నట్లుగా బిల్లులు డ్రా చేయడం, మస్టర్లలో అధికారుల సంతకం లేక పోవడం.. చేసిన పనుల్లో కూడా కొలతల్లో కూడా భారీ తేడాలు.. తదితర అవకతవకలను సోషల్ ఆడిట్ బృందం, జిల్లా అధికారులు చూసి నివ్వెరపోయారు. బొల్లాపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజా వేదిక జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు ఎవ్వరూ హాజరు కాలేదు. అయినా అధికారులే అనేక అవకతవకలను గుర్తించి సిబ్బందిని ప్రశ్నించారు. గత సంవత్సరం మండలంలోని 33 పంచాయతీల్లో రూ15,76,73,585 విలువైన 841 పనులపై అధికారుల బృందం తనిఖీ చేసింది. రావులాపురం, రేమిడిచర్ల, పలుకూరు తండా, సీతారామ్‌పురం తండా గ్రామాల్లో చనిపో యిన వారి పేర్లతో మస్టర్లు వేయడం, ఎం బుక్‌లో రికార్డులు సరిగా లేవని అధికారులు తేల్చారు. రేమిడిచర్ల, అయ్యన్న పాలెం, రావులాపురం గ్రామాల్లో వేయని మొక్కలు బతికి ఉన్న ట్లుగా నిధులు డ్రా చేశారు. కంప తొలగింపు పనులు చూపగా అందుకు సంబంధించి ఫొటోలు చూపించాలని పీడీ లింగ మూర్తి ప్రశ్నించారు. అయితే చూపిన ఫొటోలే చూపడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉపాధి హామి ప్రజా వేదిక రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏపీడీ బూసిరెడ్డి, ఏఈవో హీరాలాల్, ఎంపీపీ బత్తి రాములు, స్టేట్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ సిద్ద లింగమూర్తి

కొనుగోళ్లపై కినుక

ముగింపు దశకొచ్చిన బర్లీ సేకరణ

- ప్రక్రియపై రైతుల మిశ్రమ స్పందన
- రైతుల వద్ద ఇంకా పెద్దఎత్తున పొగాకు నిల్వలు
- రూ.273 కోట్లకు రూ.143 కోట్ల మేర కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్


బాపట్లలోని వేర్‌హౌసింగ్ గోడౌన్ వద్ద పొగాకు బేళ్లతో నిలిచి ఉన్న ట్రాక్టర్లు (ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం.. ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు.. అని నైరాశ్యంలో మునిగిపోయిన బర్లీ పొగాకు రైతులకు గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ ప్రకారమే గతంలో ఎన్నడూ లేనట్లుగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టింది. ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించింది. ప్రభుత్వం పొగాకు కొనుగోళ్లపై తీసుకున్న నిర్ణయాలపై బాపట్ల జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల బర్లీ పొగాకు రైతులు అప్పట్లో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మూడు నెలలు కొనుగోళ్ల ప్రక్రియ సాగినా.. విడతల వారీగా రైతుల ఖాతాలకు నిధులు జమ అవుతున్నా.. సాగుదారులు పలువురు ఇంకా అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. అధికారుల ప్రణాళిక లేమి వల్లనో లేక ముందస్తు అంచనాలు లేకపోవడం వల్లనో కానీ కొనుగోళ్ల ఘట్టం అనేక ఇబ్బందులకు దారి తీయడమే రైతుల్లో అసంతృప్తికి కారణమని తెలిసింది. సెప్టెంబరు చివరికే కొనుగోళ్లు నిలిపేస్తామని తొలుత మార్క్‌ఫెడ్ ప్రకటించింది. కానీ మరో రెండు వారాలు పొడిగిస్తున్నట్లు అధికారులు నామమాత్రపు ప్రకటన చేశారు తప్పితే ఎక్కడా బర్లీ సేకరిస్తున్న దాఖలాలు లేవు. అయితే ఇప్పటికీ రైతుల వద్ద ఇంకా కనీసంగా 80 వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నాయని క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి. మొత్తం రిజిష్టర్ చేసుకున్న రైతుల సంఖ్య 16,734గా ఉండగా అంతిమంగా మార్క్‌ఫెడ్ గణాంకాల ప్రకారం 12,250 మంది

(మిగతా 6లో)

బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి గతంలో ప్రభుత్వం రూ.273 కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు రూ.143 కోట్ల మేర మాత్రమే కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. మూడు నెలల్లో 2,12,949 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సేకరించింది. ఇందులో అత్యధికంగా బాపట్ల జిల్లా నుంచి 1,43,356 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో 32,729, పల్నాడులో 24,409 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.98 కోట్లు జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.45 కోట్లు చెల్లించాల్సి ఉంది.

2,12,949 క్వింటాళ్ల సేకరణ..

భారీ వర్షం

- పొంగిపొర్లుతున్న వాగులు
- పలు ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు


రెంటచింతల : పొంగిపొర్లుతున్న పశర్లపాడు గ్రామం వద్ద పిల్లివాగు

అమరావతి, పెదకూరపాడు, మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, గురజాలటౌన్, రొంపిచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. కుండ పోత వర్షానికి ఎక్కడికక్కడ వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల వెంబడి పొలాలు నీటమునిగాయి. పెదకూరపాడులో 99.2 వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ధనలక్ష్మి తెలిపారు. రెంటచింతల మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల వరకు 7 సెం.మీ వర్షపాతం నమోదైంది. అమరావతిలోని పెదమద్దూరు వాగుపై ఉన్న చప్టాపై ఉధృతంగా నీరు ప్రవహించడంతో ఇసుక లారీ ఇరుక్కుపోయింది. భారీ వర్షానికి పెదకూరపాడు నుంచి పాటిబండ్ల మార్గంలోని వాగుపై ఉన్న చప్టా కొట్టుకు పోయింది. మండలంలోని పరస గ్రామం నుంచి కంభంపాడు మధ్యలో చప్టాలపై ఉధృతంగా వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. మాచర్లలో సోమవారం రాత్రి 6 గంటల నుంచి రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 24 గంటలు గడిచినా వర్షపునీరు రోడ్లపైనే నిలిచి ఉండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చంద్రవంక ఉధృతి కొనసాగుతూనే ఉంది. వెల్దుర్తి మండల పరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షంతో పొలాల్లో నిలిచిన నీరు మడుగులను తలపిస్తున్నాయి. మండాది కానాగు, రచ్చమలపాడు వాగు, పట్లవీడు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రెంటచింతల మండలంలో పిలివాగు మహోగ్రంగా ప్రవహించడంతో సుమారు 18 గంటల పాటు ఆయా గ్రామాల ప్రజలు బాహ్యప్రపంచానికి దూరంగా ఉన్నారు. ద్విచక్ర వాహనంపై పశర్లపాడు వాగు దాటే క్రమంలో పూజారి సాయిసుందర్ కొట్టుకుపోగా ఓ చెట్టును పట్టుకుని ఒడ్డుకు చేరారు. గోలి గ్రామ సమీపంలోని వాగు కూడా ప్రమాదకరస్థాయిలో ప్రహిస్తుంది. గురజాల పట్టణ, మండల పరిధిలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండలంలోని చర్లగుడిపాడు వేణుగోపాలస్వామి ఆలయం గర్భగుడిలోకి భారీగా వర్షపునీరు చేరింది. మాడుగుల గ్రామం ముందు ఉన్న ఎద్దులవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పిడుగు పడడంతో గురజాలలోని మాడుగుల రోడ్డులోని ఎస్టీ కాలనీలో ఓ గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రొంపిచర్ల మండలంలోని మాచవరం, కొత్తపల్లిలోని చప్టాలపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తుంది.


అమరావతి : పెదమద్దూరు వాగు చప్టాపై గుండా ప్రవహిస్తున్న వరదనీరు

వినుకొండలో ఐటీ సోదాలు

వినుకొండటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం సమీపంలోని ఓ దాల్ మిల్‌లో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మిల్లుతో పాటు యజమాని ఇంట్లో కూడా దాడులు చేశారు. వ్యాపార లావాదేవీలకు సంబంధించిన ఖాతాపుస్తకాలు, పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఐటీ తనిఖీలకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని వినుకొండ పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

- సేవలపై నీతి ఆయోగ్ కమిటీ పరిశీలన


నరసరావుపేట : ములకలూరు ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న నీతి ఆయోగ్ సభ్యులు

రొంపిచర్ల, నరసరావుపేట రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మండలంలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రం -2లో, నరసరావుపేట మండలం ములకలూరు ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నీతి ఆయోగ్ కమిటీ సభ్యులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆయా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువు సరి తూచడంతో పాటు లబ్ధిదారులకు అందే పౌష్టికాహారం పంపిణీపై లబ్ధిదారులను కలిసి ప్రశ్నించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు వచ్చి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కలిగిస్తున్నారా లేదా అని గర్భిణులను ప్రశ్నించారు. తమ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ బృందం వెంట సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా ఉన్నారు.

ఎత్తిపోతలకు జలకళ

మాచర్ల మండలంలోని పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతల జలకళతో పర్యాటకులను ఆకర్షిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, అటవీ మార్గాల ద్వారా వరద నీరు ఎత్తిపోతలకు వచ్చి చేరుతోంది. 70 అడుగుల ఎత్తు నుంచి కిందకు దూకుతున్న ఎత్తిపోతల జలపాతం అందాలు పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. జలపాతం అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఎత్తిపోతలకు చేరుకుంటున్నారు.

(విజయపురిసౌత్, ఆంధ్రజ్యోతి)



కొల్లిపరకు బ్రెజిల్ బృందం



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధుల బృందం

కొల్లిపర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ అమలు విధానాలపై అవగాహన పొందటానికి రాష్ట్రంలో పర్యటిస్తున్న బ్రెజిల్ ప్రతినిధుల బృంద సభ్యులు మంగళవారం కొల్లిపర మండలంలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ ఏడీఏ రాజకుమారి బ్రెజిల్ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికి జిల్లాలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయ అమలు తీరు, పురోగతి గురించి క్లుప్తంగా వివరించారు.

బయో ఇన్‌పుట్‌ల తయారీ, ఘన జీవామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం తయారీపై రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజి ఆఫీసర్ లక్ష్మనాయక్ వారికి అవగాహన కలిగించారు. దేశీ ఆవు ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్నదని, ఆవుపేడ, మూత్రంలో అధికంగా లభించే సూక్ష్మజీవులు భూమి సారాన్ని పెంచి పంటల ఆరోగ్యాన్ని కాపాడతాయని బ్రెజిల్ బృందానికి తెలియజేశారు. అనంతరం బ్రెజిల్ ప్రతినిధుల బృందం రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో బ్రెజిల్ బృందం ప్రతినిధులతో పాటు ప్రకృతి వ్యవసాయాధికారులు జాకీర్ హుస్సేన్, కృష్ణారావు, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జేడీతో మిర్చి ఎగుమతిదారుల భేటీ



మిర్చియార్డులో ఎక్స్‌పోర్టర్లతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి ఎగుమతుల రవాణా విషయంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రమేయాన్ని అరికట్టాలని మిర్చి ఎగుమతిదారులు మార్కెటింగ్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ (జేడీ) కాకుమాను శ్రీనివాసరావును కోరారు. మంగళవారం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనంలో జేడీ శ్రీనివాసరావుతో ట్రేడర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మార్కెటింగ్ డీడీ దివాకర్, గుంటూరు ఏడీ సత్యన్నారాయణ చౌదరి, ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక హాజరయ్యారు. సమావేశంలో తొలుత వ్యాపారస్థుల సమస్యలను జేడీ శ్రీనివాసరావు అడిగి తెలుసుకొన్నారు. మిర్చి ట్రేడర్ల తరుపున తోట రామకృష్ణ, కొత్తూరి సుధాకర్, జుగిరాజ్ భండారి, నరేంద్ర తదితరులు మాట్లాడారు. కొన్ని నెలలుగా లారీ అసోసియేషన్ ప్రమేయం లేకపోవడం వల్ల మిర్చి ఎగుమతులు భారీగా జరిగాయని, ఇతర మార్కెట్ కమిటీలకు వెళ్లిపోయిన వ్యాపారస్థులు కూడా వెనక్కు వచ్చేశారని తెలిపారు. మళ్లీ నాలుగైదు రోజుల నుంచి లారీ యజమానులపై యూనియన్ నేతలు ఒత్తిడి తెచ్చి లోడింగ్‌లు పెట్టకుండా అడ్డుకొంటున్నారని ఆరోపించారు. దీని వల్ల తమ వద్ద రూ. కోట్లాది విలువ చేసే స్టాకు ఉండిపోయిందని అన్నారు. దీనిపై తగిన చర్యలు చేపట్టకపోతే తాము ట్రేడ్ బంద్‌కు వెళ్లడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తేల్చి చెప్పారు. దీనిపై జేడీ శ్రీనివాసరావు స్పందించి, తాను లారీ అసోసియేషన్ ప్రమేయం గురించి మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీతకు నివేదించి ఆమె ద్వారా రవాణాశాఖ కమిషనర్, రాష్ట్ర డీజీపీకి లేఖలు రాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యార్డు ఇన్‌చార్జీ సుబ్రహ్మణ్యం, గ్రేడ్-3 సెక్రెటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై జగన్‌ది విష ప్రచారం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విషప్రచారం చేస్తున్నారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాపాటి శ్రీధర్ విమర్శించారు. స్వప్రయోజనాల కోసమే ఆయన ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీమద్యం ఘటనపై ప్రభుత్వం చాలా వేగంగా చర్యలకు ఉపక్రమించిందన్నారు. కల్తీమద్యం తయారీ కేసులో 14 మంది ప్రమేయాన్ని గుర్తించి 10 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, సురేంద్ర నాయుడు ప్రమేయంపై ప్రభుత్వం దర్యాప్తుకు ఆదేశించిందన్నారు. వారిపేర్లు కల్తీ మద్యం వ్యవహారంలో బయటకు వచ్చిన వెంటనే నిజానిజాలు బహిర్గతం కాకముందే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని చెప్పారు. ఇది తెలిసి కూడా జగన్ తన అవకాశవాదం, విద్వేష రాజకీయాలను వదలడం లేదన్నారు. 2022లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో సంభవించిన కల్తీమద్యం మరణాలకు ఎవరు కారకులో అప్పుడు సీఎంగా ఉన్న జగన్ ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని అన్నారు. తన పాలన రైతులకు స్వర్ణయుగమని చెప్పుకునే జగన్ తన హయాంలో వారానికి నలుగురు రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శవాన్ని డోర్‌డెలివరీ చేసిన ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవడం చేతగాని ఆయన కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని కొమ్మాలపాటి దుయ్యబట్టారు.

టెయిల్ పాండ్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

12 గేట్లు ఎత్తి పులిచింతలకు నీటి విడుదల

రెంటచింతల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడతో 12 గేట్లను ఎత్తి పులిచింతలకు 1,99,702 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి 1,61,381 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0224 ఎంయూల విద్యుత్ తయారవ్వగా మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని వారు చెప్పారు.

9న పీజీ సెట్ దివ్యాంగ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన

ఏఎన్‌యూ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్-2025 ఉత్తీర్ణులైన ప్రత్యేక క్యాటగిరీకి చెందిన డిజేబుల్డ్ అభ్యర్థులకు ఈ నెల 9న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పీజీసెట్ కన్వీనర్ ఆచార్య రవికుమార్ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ఆ రోజు ఏఎన్‌యూ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ పీడబ్ల్యూడీ, విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కన్వీనర్ రవికుమార్ పేర్కొన్నారు.



పీ-4 అమలుపై వివరాలను తెలుసుకుంటున్న రాజస్థాన్ ప్రతినిధులు

పీ-4 అమలుపై రాజస్థాన్ అధికారుల ఆరా

మంగళగిరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 పథకంపై రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు వివరాలను సేకరించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర విజన్-2024 యూనిట్ కార్యాలయాన్ని మంగళవారం రాజస్థాన్ అధికారుల బృందం సందర్శించింది. పీ-4 పథకానికి సంబంధించిన సమగ్ర సమాచారం, అమలు తీరు, నియోజకవర్గ, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ తదితర విషయాలను స్థానిక అధికారులు వారికి వివరించారు. 2047 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నెరవేర్చే నిమిత్తం రూపొందించిన కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్స్‌ను గురించి అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గొప్పగా ఉన్నాయని రాజస్థాన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేతన్ ప్రకాశ్ మండవల్, నిర్మల్ సేఠీ, వినేష్ సంఘ్వీ, డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఉపగణాంకాధికారి సౌలు రాజు, మంగళగిరి సహాయ గణాంకాధికారి దానబోయిన బాలనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల విజేత హుజూర్‌నగర్



ప్రథమ స్థానంలో నిలిచిన హుజూర్‌నగర్ ఎడ్ల జత

క్రోసూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల విజేతగా తెలంగాణలోని హుజూర్ నగర్‌కు చెందిన సుంకి సురేంద్రారెడ్డి, సుంకి సాకేత్‌రెడ్డి, సుంకి సారికారెడ్డికి చెందిన ఎడ్ల జత నిలిచింది. విజేతలకు బయ్యవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పయ్యావుల సీతారామయ్య అండ్ సన్స్ వారు మోటారు బైక్‌ను బహూకరించారు. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీర స్వామి ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరికి రూ. 60 వేల బహుమానాన్ని అందజేశారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరీల ఎడ్ల జత మూడో స్థానంలో నిలిచింది. వారికి రూ. 40 వేల బహుమతిని అందజేశారు. నాలుగో స్థానంలో కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పులిపాకకు చెందిన గిరికపాటి శ్రీధర్‌కు చెందిన ఎడ్ల జత నిలిచింది. వీరికి రూ. 30వేల బహుమానాన్ని అందజేశారు. ఐదో స్థానంలో నాగ శివ శంకర్ రూ. 20వేలు, 6వ స్థానంలో గాయం సుజన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి రూ. 15 వేలు, ఏడో స్థానంలో నిలిచిన గూడ వల్లి లక్ష్మీ దీక్షిత చౌదరీకి రూ. 12వేల బహుమానాన్ని అందజేశారు. 8,9,10వ స్థానాల్లో అక్కినేని ముకుల్ సత్య చౌదరి, ఐతంరాజు సత్యనారాయణ, పావులూరి వీర స్వామి చౌదరీకి చెందిన ఎడ్ల జతలు నిలిచాయి. న్యాయ నిర్ణేతలుగా రాధాకృష్ణ, దుగ్గి శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన గ్రామానికి చెందిన కమిటీ వారిని అభినందించారు.

జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్లెక్సీ రగడ

● యనమదలలో సోమవారం అర్ధరాత్రి కొట్టుకున్న ఇరు వర్గాలు

● ఫ్లెక్సీని మార్ఫింగ్ చేయడమే వివాదానికి కారణం

ప్రత్తిపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్లెక్సీ రగడ సృష్టించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలో ఏర్పాటు చేసిన జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్లెక్సీని ఏఐలో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టడం గొడవకు దారి తీసింది. యనమదలలో జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్లెక్సీని అభిమానులు ఏర్పాటు చేశారు. అయితే దీనిని కొందరు ఆకతాయిలు సేమ్ అదే ఫ్లెక్సీని జూనియర్ ఎన్‌టీఆర్‌కు వెంట్రుకలు లేనట్టు (బోడి గుండు) చూపిస్తూ క్రియేట్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకర పదజాలతో పోస్టింగ్‌లు పెట్టారు. దీంతో గ్రామంలోని ఎన్‌టీఆర్ అభిమానులు ఆగ్రహించారు. ఈ క్రమంలో గ్రామంలో సోమవారం రాత్రి గొడవ జరిగి కొట్లాటకు దారి తీసింది. ఇరు వర్గాలకు చెందిన వారు కొట్టుకోవడంతో గ్రామంలో అర్ధరాత్రి ఒక్కసారిగా అలజడి ప్రారంభమైంది. దీంతో ఈ పంచాయతీ మంగళవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు చేరింది.



వివాదానికి దారి తీసిన మార్ఫింగ్ చేసిన జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్లెక్సీ

కొనుగోళ్లపై కినుక

(5వ పేజీ తరువాయి)

రైతుల నుంచే కొనుగోళ చేశారు. అంటే ఇంకా 4484 మంది రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయాల్సి ఉంది. వీరు కాకుండా అవగాహన లేక మరెందరో రిజిష్టర్ చేసుకోలేదని సమాచారం. వీరందరి వద్ద పెద్దఎత్తున నిల్వలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వీరందరిలోనూ అయోమయం నెలకొంది. మరో వైపు కేబినెట్ ఆమోదం తెలిపిన నిధులు కేటాయింపులో రూ.130 కోట్లు మిగులు ఉన్నట్లు కనబడుతుండడంతో కొనుగోళ్లు కొనసాగించడంపై ఉన్న అభ్యంతరం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమైన దగ్గర నుంచి కూడా వాటిని నిల్వ ఉంచడానికి గోడౌన్ల లభ్యత అధికారులకు సవాల్‌గా మారింది. వీటి విషయంలో ముందస్తు సన్నద్ధత లేకపోవడం కూడా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని రైతులకు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని గోడౌన్లకు తీసుకువెళ్లే విధంగా షెడ్యూలింగ్ ఇవ్వడం, రవాణా ఖర్చులపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని రైతులు తప్పుబట్టారు. ఇవన్నీ ఒక ఎత్తయితే 20 క్వింటాళ్ల పరిమితి అని ప్రభుత్వం ప్రకటించాక రైతుల సెల్ ఫోన్లకు పొంతనలేని మెసేజ్‌లు రావడం, వారు తీసుకొచ్చిన పొగాకు బేళ్లను తిరిగి తీసుకువెళ్లడం లాంటివన్నీ కూడా అధికారుల వైఫల్యానికి సాక్ష్యంగా నిలిచాయి. మార్కెటింగ్, వేర్‌హౌసింగ్, ఎఫ్‌సీఐ గోదాములు మొత్తం 56 చోట్ల పొగాకును నిల్వ ఉంచారు. పొగాకు నాణ్యత విషయంలో మార్క్‌ఫెడ్ నియమించుకున్న బయ్యర్లకు జీతాలు చెల్లించే విషయంలో కూడా ఎడతెగని జాప్యం కారణంగా ఇటీవల వారు విధులు కూడా బహిష్కరించారు. కొనుగోళ్ల వాస్తవికతతో పాటు, నిధుల లభ్యత, గోడౌన్ల సాధ్యాసాధ్యాలను ప్రభుత్వానికి వివరించడంలో అధికారుల తప్పిదాల వల్ల రైతుల ఆశలను మార్క్‌ఫెడ్ చేరుకోలేకపోయింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

41,648 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,284 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,648 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,909 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14400	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	14500
273	---	---	నెంబరు. 5	10000	14000
341	10000	14800	273	---	---
4884	---	---	341	10000	15000
సూపర్ 10	---	---	4884	10000	13600
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	14800
షార్క్-1	----	---	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10000	15400	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7200

ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం రేపు

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థాన పాలకమండలి ప్రమాణ స్వీకారం ఈనెల 9వ తేదీ సాయంత్రం 4గంటలకు ఆలయ ప్రాంగణంలో జరుగుతుందని దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ తెలిపారు. పాలకమండలిలో వంశపారంపర్య ధర్మకర్త చైర్మన్‌గా 11మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం జరుగుతుంది. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని రేఖ తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

మాచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ల్యాప్ ట్యాప్‌లు చోరీ

రెంటచింతల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెంలో ఉన్న మోడల్ స్కూళ్లో రెండు ల్యాప్‌లు చోరీకి గురాయ్యాయి. ఈమేరకు ప్రిన్సిపాల్ కె.పాపయ్య పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతి

రెంటచింతల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని సెయింట్‌జోసఫ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కొమ్మారెడ్డి చిన్నపరెడ్డి మంగళవారం మృతి చెందాడు. ఆయన కొంతకాలం నుంచి అస్వస్థులుగా ఉన్నారు. ఆయనకు భార్య సుశీల, ఇద్దరు సంతానం. మాస్టార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఫాదర్స్ వైఎల్ మర్రెడ్డి, గోవిందు బాలస్వామి, కే ఇన్నారెడ్డి, పి.సుందరరాజు, ఎల్.లూర్దురెడ్డిలతో పాటు తుమ్మా లూర్దురెడ్డి తదితరులున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

దాచేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీలోని 3వ సచివాలయంలో కలెక్టర్ ఆదేశాలతో రెడ్‌క్రాస్ సమన్వయంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానానికి ముందుకు వచ్చారు. తహసీల్దార్‌తో పాటు నగర పంచాయతీ కమిషనర్ జీ వెంకటేశ్వర్లు, కూటమి నేతలు నర్ర పుల్లయ్య, సొసైటీ నారాయణ, వార్డు కౌన్సిలర్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

దేవాలయంలో వేలం పాట

దాచేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రానున్న కార్తీక పౌర్ణమితో భట్రుపాలెంలో జరిగే శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణంతో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, తలనీలాలు అమ్మకాలు, కొనుగోళ్లకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు దాచేపల్లి దేవదాయ శాఖ ఈవో నెమిలిరెడ్డి మంగళవారం వివరించారు. దేవస్థానంలో కొబ్బరికా యలు, పూజా ద్రవ్యాలు, విస్తర్లు, బెల్లం అమ్ముకొనేందుకు ఐదు వేల రూపాయలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకోవటం, లడ్డు ప్రసాదం అమ్ముకొనే హక్కును రూ.5వేలు, తల నీలాలు సేకరించుకొనేందుకు మరో రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. దేవస్థానానికి బకాయిలు ఉన్న వ్యక్తులు గాని, ఎటువంటి లావాదేవీలు ఉన్న వారు గాని ఈ పాటలో పాల్గొన రాదని తెలిపారు. వివరాలకు 7673951603, 9490243839 ఈ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్తెనపల్లిలో చోరీ

సత్తెనపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు కొనుగోలు చేసేందుకు బ్యాంకులు డబ్బులు డ్రా చేసి బైక్ కవర్‌లో ఉంచిన రూ 3 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన పట్టణంలోని చెక్ పోస్టు సెంటర్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. సత్తెనపల్లి మండలం కందులవారి పాలెంకు చెందిన శ్రీనివాసరెడ్డి అనే రైతు ఎరువుల కొనుగోలు నిమిత్తం పట్టణంలోని ఓ బ్యాంక్‌లో రూ.3 లక్షల నగదును డ్రా చేసి చెక్ పోస్టు సెంటర్లో ఉన్న ఎరువుల దుకాణం వద్దకు వెళ్లాడు. నగదును బైక్ కవరులో ఉంచాడు. దుకాణంలోకి వెళ్లి షాపు యజమానితో మాట్లాడి తిరిగి వచ్చే సరికే బైక్‌లో ఉన్న నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపడి గుడిసె దగ్ధం

గురజాలటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడి భారీ వర్షం పడింది. మాడుగుల రోడ్డులోని ఎస్టీ కాలనీలో గుడిసెపై పిడుగుపడడంతో పూర్తిగా దగ్ధమైంది. కాగా ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న గురజాల తహసీల్దార్ దుర్గేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గుడిసెలో నివసిస్తున్న జగన్నాథం నాగయ్యకు తక్షణ సాయం కింద నిత్యావసరాలు పంపిణీ చేశారు. రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

పోషణ మాసోత్సవం

అచ్చంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుంపాలెంలో మంగళవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ మాణిక్యమ్మ తెలియజేశారు. కిచన్ గార్డెన్ ఏర్పాటు, పోషకాహార తయారీ విధానాలపై తల్లులకు వివరించారు. ఎత్తులు, బరువులు చూసి పిల్లల పెరుగుదల గురించి తల్లులతో చర్చించారు. తల్లులకు అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. హ్యాండ్ వాష్ గురించి తల్లులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మాణిక్యమ్మతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పోటెత్తిన వాగులు వంకలు

- రోడ్లపై నిలిచిన వర్షపునీరు
- కొట్టుకు పోయిన పాటిబండ్ల చప్టా
- రాకపోకలకు ఇబ్బందులు
- నీట మునిగిన పంట పొలాలు

మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి, గురజాలటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వర్షపునీరు రోడ్లపై చేరి వాహనదారులకు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులకు కలిగింది. నెహ్రూనగర్‌లోని ఫైర్ స్టేషన్ రోడ్డులో వర్షపునీరు నిలిచిపోవడంతో ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 24 గంటలు గడిచినా వర్షపునీరు రోడ్డుపైనే నిలిచి ఉండడంతో ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వెళ్లే సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసిన ప్రతిసారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రెంటచింతల మండలంలోని పలు వాగులు వంకలు పొంగిపొర్లాయి. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి.. పాలువాయి, పశర్లపాడు గ్రామ పొలిమేరల్లో


పెదకూరపాడు - పాటిబండ్ల వెళ్లే రోడ్డులో భారీ వర్షానికి పడిపోయిన బ్రిడ్జి


మాచర్ల ఫైర్ స్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షపునీరు

ఉన్న పిలివాగు మహోగ్రంగా ప్రవహించడంతో సు మారు 18 గంటల పాటు ఆయా గ్రామాల ప్రజలు బాహ్యాప్రపంచానికి దూరంగా ఉన్నారు. గోలి గ్రామ సమీపంలోని వాగు కూడా ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తూనే ఉంది. వెల్దుర్తి మండల పరిధిలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాల్లో నిలిచిన నీరు మడుగులను తలపిస్తున్నాయి. మండాది కానాగు, రచ్చమలపాడు వాగు, పట్లవీడు వాగులు వర్షం ధాటికి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురజాల మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని చర్లగుడిపాడు వేణుగోపాలస్వామి ఆలయం గర్భగుడిలోకి భారీగా వర్షపునీరు చేరింది.


చర్లగుడిపాడు వేణుగోపాలస్వామి గర్భగుడిలోకి చేరిన వర్షపునీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న మండాది కానాగు

మాడుగుల గ్రామం ముందు ఉన్న ఎద్దులవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

పెదమద్దూరు వద్ద నిలిచిన రాకపోకలు

అమరావతి: సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీరు పెదమద్దూరు వాగుపై ఉన్న చప్టాపై గుండా ప్రవహించడంతో విజయవాడ వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చప్టాపై ఉన్న గుంతల్లో ఉదయం ఇసుకలోడుతో వెళ్తున్న లారీ ఇరుక్కుపోయింది. అంతేగాక వాగుల వెంబడి పంట పొలాలు వందల ఎకరాల్లో నీట మునిగాయి.

● పెదకూరపాడు : పెదకూరపాడు ప్రాంతంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెదకూరపాడు నుంచి పాటిబండ్ల వెళ్లే పంచా యతీరాజ్ రహదారిలో వాగు పై ఉన్న భారీ నీటి ప్రవాహా నికి కొట్టుకు పోయింది. గతంలో కురిసిన వర్షాలకు ఈ చప్టాకు గండి పడి కొంత మేర ఇరు గ్రామాలకు రాకపోకలు అంతంత మాత్రంగానే కొనసాగాయి. రాత్రి కురిసిన వర్షానికి ఇరు గ్రామాలకు పూర్తి స్థాయిలో రాకపోకలు నిలిచి పోయాయి. పరస గ్రామం నుంచి కంభం పాడు వెళ్ళే గ్రామాల మధ్యలో లెవల్ చప్టాల పై ఉధృతంగా వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచి పోయాయి.

వాల్మీకి మహర్షికి నివాళులు


వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

సత్తెనపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, మారెళ్ళ స్వామి, లోకేశ్వరరావు, ఆంజనేయులు, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

● రాజుపాలెంలో ఉన్న మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వాల్మీకీలను ఎస్టీలుగా గుర్తించాలి

● కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన

పిడుగురాళ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడాన్ని వాల్మీకి సామాజికవర్గం కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటుందని రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు తెలిపారు. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో వాల్మీకి జయంతి కార్యక్రమంలో ముప్పన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించి వారి అభ్యున్నతికి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి చెన్నారావు, కేపీ వెంకయ్య, సయ్యద్ అమీర్‌అలీ, అంజిబాబు, రవి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్ : పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ దుర్గేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు


విధులు బహిష్కరించిన పిడుగురాళ్ల న్యాయవాదులు

పిడుగురాళ్ల, సత్తెనపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ పిడుగురాళ్ల న్యాయవాదులు విధుల బహిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయవ్యవస్థపై జరిగిన దాడిని ప్రతిఒక్కరు ఖండించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో బత్తుల దాసు, షేక్ మౌలాలి, పి.నవ్య, లోకేశ్వరి, మణి, మందా జాకబ్, ఎం వెంకటేశ్వర్లు, ఎస్‌వీఎస్ కోటేశ్వరరావు, గంగూరి అజయ్‌కుమార్, చిన్నం మణిబాబు, గోపాలకృష్ణమూర్తి, అబ్దుల్ రహీం, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినియోగించుకొనే వస్తువులపై పన్ను తగ్గింపు

● పల్నాడు జిల్లా జీఎస్టీ అధికారి ఆనంద్


సూపర్ జీఎస్టీ పై విద్యార్థులకు తెలియ జేస్తున్న జీఎస్టీ అధికారి సీహెచ్ ఆనంద్

నకరికల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వినియోగించుకొనే పలు వస్తువులపై ప్రభుత్వం కొన్నింటికి పూర్తిగా పన్ను రద్దు చేయగా మరికొన్ని వస్తువులపై జీఎస్టీని భారీగా తగ్గించినట్లు పల్నాడు జిల్లా జీఎస్టీ అధికారి సీహెచ్ ఆనంద్ తెలిపారు. మంగళవారం సూపర్ జీఎస్టీ...సూపర్ పొదుపు కార్యక్రమంలో భాగంగా నకరికల్లులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో, వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపయోగించుకొనే వస్తువులపై జీఎస్టీ రద్దు చేసిన, తగ్గించిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ కాశయ్య, హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కే లక్ష్మి, కరిముల్లా, పీఎస్ ప్రసాదు, పీఆర్ ఏఈ కే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ నోడల్ అధికారి దత్తాత్రేయ అన్నారు. వెల్దుర్తి కస్తూర్బా గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మకట్‌లాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలను పురస్కరించుకొని మంగళవారం ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థలలో జీఎస్టీ తగ్గింపుపై ప్రతి కుటుంబానికి జరిగే ప్రయోజనం గురించి అసిస్టెంట్ కమిషనర్ పి.నారాయణశాస్త్రి వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీవో టి.పీటర్‌బాబు, ప్రిన్సిపాల్ పి.నరేష్, జానపాడు సచివాలయ ఉద్యోగులు, ఆక్స్‌ఫర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక దృఢత్వం అలవర్చుకోవాలి

● ఆరోగ్య కౌన్సిలర్ శాంతి వర్ధన్

నకరికల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు మానసిక దృఢత్వం, శారీరక దృఢత్వం కలిగి ఉండాలని మానసిక ఆరోగ్య కౌన్సిలర్ శాంతి వర్ధన్ తెలిపారు. మంగళవారం నకరికల్లు కేజీబీవీలో అంతర్జాతీయ పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం యోగాసనాల ప్రయోజనాల గురించి వివరించారు. ఫ్లకార్డుల ప్రదర్శన చేశారు. బాలికలచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అందరూ బాలికలే ఉంటారు. అలాంటి పాఠశాలలో మానసిక ఆరోగ్య కౌన్సిలర్‌గా శాంతి వర్ధన్‌ను ఎలా నియమిస్తారని బాలికల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఉద్యోగినిని ఆ స్థానంలో నియమించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మానసిక ఆరోగ్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ఖాదర్‌షాహ హుస్సేన్ విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజూ ధ్యానం, యోగా చేయడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంటలపై గడ్డి మందు పిచికారి

- మోర్జంపాడులో కొందరి దుశ్చర్య
- రైతుకు సుమారు రూ.4.50 లక్షల నష్టం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మాచవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంతో కష్టపడి పండించిన పంట నోటికాడికి అందొచ్చిన సమయంలో కొందరు వ్యక్తులు దానిపై గడ్డి మందు పిచికారి చేయడంతో ఎండిపోయాయి. దాంతో రైతుకు రూ.4.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఈ ఘటన మాచవరం మండలంలోని మోర్జంపాడు గ్రామంలో జరిగింది. మోర్జంపాడు గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి 1.25 ఎకరాల్లో పత్తి పంట, ఒక ఎకరంలో మిర్చి పంట సాగు చేశాడు. రెండు పంటలు కూడా కాయ దశలో ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పేరం నర్సిరెడ్డి, పేరం శ్రీనివాసరెడ్డి, పేరం సైదమ్మ అనే ముగ్గురు వ్యక్తులు పత్తి, మిర్చి పంటలపై గడ్డి మందు పిచికారి చేయటంతో అవి వడబడి పోయాయని శ్రీనివాసరెడ్డి ఆరోపించాడు. పత్తి పంట పూర్తిగా వడబడి పోయిందని, మిర్చి పంట 75 శాతం ఎండిపోయిందని తెలిపాడు. దాంతో తనకు రూ. 4.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని చెప్పాడు. ఈ మేరకు శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మాచవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాచవరం గ్రామానికి చెందిన డేరంగుల వెంకయ్య (80) మంగళవారం మృతి చెందాడు. ఈ నెల 4వ తేదీన మాచవరం గ్రామానికి చెందిన నలబోతుల శ్రీనివాసరావు ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా వెనుక వైపు ఉన్న వెంకయ్యకు తగిలింది. గాయాలపాలైన వెంకయ్యను గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆక్రమిత భూములపై విచారణ

పిడుగురాళ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కోనంకి గ్రామానికి చెందిన ప్రభుత్వ భూములను సుమారు 46 మంది రైతులు రెవెన్యూ రికార్డులలో తమ పేర్లు నమోదు కావడంపై మంగళవారం పిడుగురాళ్ల తహసీల్దార్ విచారణ చేపట్టారు. ఎటువంటి అర్హత లేకున్నా ప్రభుత్వ భూముల్లో తమ పేర్లు నమోదు పొందడంపై కలెక్టర్ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల రెవెన్యూ అధికారులు కోనంకిలో ప్రభుత్వ భూములు పొందిన రైతులకు నోటీసులు జారీచేశారు. మంగళవారం 20 మంది రైతులకు నోటీసులు జారీచేయగా వారందరూ రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. వారివద్ద ఉన్న పత్రాలు, ఆయా రైతుల నుంచి భూములు ఏ విధంగా పొందారనే దానిపై లిఖిత పూర్వకంగా తగు నివేదికను తీసుకున్నారు. ఈ నెల 10వ తేదీన మరో 26 మందికి నోటీసులు జారీచేశామని, పూర్తి విచారణ అనంతరం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ మధుబాబు, వీఆర్వో కోటేశ్వరరావులు తెలిపారు.

శంకర్‌నాయక్ కుటుంబానికి అండగా ఉంటా

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శంకర్‌నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. టీడీపీ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ సోమవారం మృతి చెందారు. మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకర్ నాయక్ గృహానికి వెళ్ళి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నేతలు దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, మస్తాన్‌వలి, నూర్‌బాషా జానీ బాబు, కే పురుషోత్తం నాయక్ తదితరులు ఉన్నారు. అనంతరం 13వ వార్డులో తెలుగుయువత నేత నోముల ప్రకాష్ తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మరణించటంతో ఆయన చిత్రపటానికి కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మృతి

పెదకూరపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాదర్ బాషా గుండె పోటుతో మృతి చెందారు. పెదకూరపాడులోని కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఖాదర్ బాషా మధ్యాహ్నం బస్టాండ్ సమీపంలో గుండె నొప్పి రావటంతో ఒక్కసారిగా కుప్ప కూలారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు స్థానికులు తీసుకెళ్ళగా అప్పటికే బాషా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన షేక్ ఖాదర్ బాషా నాలుగు సంవత్సరాలుగా పెదకూరపాడులో విధులు నిర్వహిస్తున్నారు. బాషా మృతదేహానికి అధికారులు నివాళులర్పించారు. బాషాకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

అచ్చమ్మకు దుర్గారావు నివాళి

మాచర్ల రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త మంజుల అచ్చమ్మ అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వడ్డెర సంఘ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొమెర దుర్గారావు 25వ వార్డుకు చేరుకొని అచ్చమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, అంజి, మంజుల వెంకటేశ్వర్లు, మాచర్ల బాబు, చింతమళ్ల అడవి రాముడు, మంజుల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ పర్యటన

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటన జరిగిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముంబై పర్యటన చేపట్టారన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పెట్టుబడులు, ఉద్యోగావకాశాల పరంగా వెనుకబడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో లోకేశ్ సమావేశమై పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి కంపెనీల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువత సాధికారిత పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను తెచ్చి ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

బెల్లంకొండ జడ్పీ పాఠశాలను పరిశీలించిన డీఈవో


అధికారులు, టీడీపీ నాయకులతో చర్చిస్తున్న డీఈవో చంద్రకళ

బెల్లంకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని డీఈవో చంద్రకళ మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు పాఠశాల గదులకు వెళ్లాలన్నా వర్షపు నీటిలోనే వెళ్లే పరిస్థితి ఉందని, దీని వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు డీఈవో చంద్రకళకు తెలిపారు. స్పందించిన ఆమె మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న వర్షపు నీటిని పరిశీలించారు. గ్రామంలో నుంచి వచ్చే వర్షపు నీటిని ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే విధంగా గ్రావెల్, చిప్స్‌తో రహదారిని ఏర్పాటు చేసి విద్యార్థులు పాఠశాలకు వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఆయిల్ ఇంజన్‌లతో వర్షపు నీటిని బయటకు పోయే విధంగా చూడాలని సూచించారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల టీడీపీ నాయకులు ఆమె వచ్చిన సమాచారాన్ని తెలుసుకొని అక్కడకు వచ్చారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన స్పందించారని, రెండు మూడు రోజుల్లో శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

చలో విజయవాడకు తరలివెళ్లిన ఫ్యాప్టో నేతలు


చలో విజయవాడ కార్యక్రమంలో ధర్నా నిర్వహిస్తున్న క్రోసూరు ఉపాధ్యాయులు

క్రోసూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో తల పెట్టిన ధర్నాకు క్రోసూరు మండలం నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివెళ్లారు. నాయకులు సాతులూరి రాఘవ, బోళ్ళ నరసింహారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఉపాధ్యాయులు ప్రత్యక్ష పోరుబాటకు దిగవలసి వస్తుందని వారు హెచ్చరించారు. విజయవాడకు తరలివెళ్లిన వారిలో దొప్పలపూడి వెంకటేశ్వరరావు, తూమాటి శరత్, ప్రకాష్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

● మాచర్ల రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ఫ్యాప్టో ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించిన ధర్నాకు స్థానిక ఫ్యాప్టో నేతలు తరలివెళ్లారు. వీరిలో కొమ్ము కిషోర్, రాజశేఖర్, రెహ్మాన్, సుధాకర్, శ్రీను, హరినాయక్, నాగరాజు, డేవిడ్ రాజు, మధు, ఎస్‌కె జబ్బార్, ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించక పోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం


క్రోసూరు పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

క్రోసూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించక పోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి దిగవలసి వస్తుందని యూనియన్ నాయకులు తెలిపారు. మంగళవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి డాక్టర్ అఫ్రూన్‌కు అందజేశారు. ఆశా వర్కర్ల ధర్నాకు సీఐటీయూ నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పావని, మెహరున్నీసా, నాగేంద్రం, త్రివేణి, సైదాబీ, బేబీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటి వైద్యశాలకు స్వచ్ఛాంధ్ర పురస్కారం


ఎమ్మెల్యే, కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న డాక్టర్ కేపీ చారి

మాచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటి వైద్యశాల స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు సోమవారం నరసరావుపేటలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల పురస్కారంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ కృత్తికాశుక్లా చేతుల మీదుగా మాచర్ల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి అవార్డును అందుకున్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

క్రోసూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బ్లాక్ బర్లీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించామని, ఈ రకం పొగాకు సాగు నియంత్రణకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని క్రోసూరు తహసీల్దార్ వేముల నాగరాజు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులను మించి అధిక బ్లాక్ బర్లీ పొగాకును సాగు చేస్తే దానిని ధ్వంసం చేసే అధికారం టాస్క్‌ఫోర్స్‌కు ఉంటుందన్నారు. బ్లాక్ బెర్రి పొగాకు సాగును నిషేధించినట్లు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యులు, ఏవో వేణుగోపాల్, క్రోసూరు ఎస్‌ఐ రవిబాబు, డీటీ తదితరులు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ బర్లీ పొగాకును ప్రభుత్వం నిషేధించింది. రైతులు సాగుచేయవద్దు అని తహసీల్దార్ నగేష్, ఏవో శ్రీధర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలో బ్లాక్‌బెర్రీ పొగాకు నిషేధంపై రైతులకు రెవెన్యూ, వ్యవసాయశాఖ, రెవెన్యూ, ఆరోగ్య శాఖల అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు కలెక్టర్ బొల్లాపల్లి రాక

బొల్లాపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం బొల్లాపల్లి రానున్నారు. గ్రామంలో ఫాంపాండ్, హార్టికల్చర్, భూగర్భ జలాల పెంపుదలకు నీటి సంరక్షణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం గ్రామంలో రామాలయం వద్ద మాట్లాడనున్నారు. జిల్లాలో ఎనిమిది భూగర్భ నీటి మట్టాలు బాగా పడిపోయినందున బొల్లాపల్లి మండలంలో 30.66 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోవటంతో నీటి సంరక్షణ పనులు చేపట్టేందుకు ప్రధానంగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, ఫీడర్ చానల్స్, చెక్ డ్యామ్‌లు, ఫాంపాండ్స్ వంటి పనులు చేయటం జరుగుతుందన్నారు.

11న మెగా నేత్ర వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్టు, శంకర కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఈ నెల 11న జరుగుతుందని మందాడి రవి మంగళవారం తెలిపారు. పట్టణంలోని రాజా గారి కోట డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆసుపత్రి సముదాయంలో ఉదయం 9 గంటలకు ప్రారంభవుతుందన్నారు. నేత్ర సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆటల పోటీలు

నూజెండ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు రెండు రోజుల పాటు జరగనున్నట్టు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎన్ వీ రత్నం మంగళవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి కలిగించటం, ప్రతిభ గల వారిని ప్రోత్సహించేందుకు స్కూల్ గేమ్స్ దోహదపడతాయని వెంకటరత్నం పేర్కొన్నారు.

ఎరువుల కొరత లేదు: ఏవో

ఈపూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఈపూరు మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు అన్నారు. మంగళవారం ఈపూరు గ్రోమోర్ వద్ద రైతులకు యూరియా కట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ గ్రోమోర్ సెంటర్‌కు 19.8 టన్నులు (440 బస్తాలు) యూరియా వచ్చిందన్నారు. ప్రస్తుతం పంటలు సాగు చేస్తున్న రైతులు మాత్రమే తీసుకోవాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వాడేందుకు రైతులు వాడుకోవాలన్నారు. ప్రతిరైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, అక్టోబర్ 7, (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి డీహైడ్రేట్ అయి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం పట్టణంలోని కోట సెంటర్లో చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్‌ఐ అశోక్ బాబు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని చాకిరాలమెట్టకు చెందిన పాలిప కోటేశ్వరరావు (50), రోజూ మద్యం సేవిస్తాడని మంగళవారం కోట సెంటర్లో మద్యం సేవించి డీహైడ్రేట్ అయి మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు మృతుని భార్య అలియమ్మ ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాలల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

వినుకొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ పట్టణంలోని పలు పాఠశాలలను మంగళవారం పరిశీలించారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' నవంబర్ నెల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు పాఠశాలలను పర్యవేక్షించి కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు, స్కూల్‌లో పారిశుధ్య పరిస్థితులను తనిఖీ చేసి స్కూల్ యాజమాన్యానికి తగు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా పిల్లల్లో హ్యాండ్ వాష్ ప్రోగ్రాం గురించి అవగాహన కల్పించారు. విద్యార్థినులను పాఠశాల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి విద్యార్థుల హాజరు పరిశీలించి, డ్రాప్ ఔట్స్‌నకు గల కారణాలు పాఠశాల యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇదేవిధంగా పట్టణంలోని అన్ని పాఠశాలల్లో తనిఖీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

ఈపూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈపూరు, రొంపిచర్ల మండలాలలోని మద్యం దుకాణాలను మంగళవారం సీఐ డీ వెంకటేశ్వరు తనిఖీ చేశారు. ఏపీబీసీఎల్ డిపో టీపీలతో ఏపీ టాట్స్ యాప్ ద్వారా మద్యం సీసాలను పరీక్షించారు. రొంపిచర్లలోని త్రికోటేశ్వర వైన్స్‌షాపు, ఈపూరులోని జనతా వైన్స్‌షాపులలో ఈ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు ఉన్న మద్యం దుకాణాలలోనే మద్యం కొనుగోలు చేయడం ద్వారా కల్తీ, నకిలీ మద్యంకు దూరంగా ఉండవచ్చన్నారు. అదేవిధంగా నాటుసారా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

నూజెండ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ కార్యక్రమాల్లో జడ్పీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవోలు సత్యనారాయణ, రవిచంద్ర, పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, సర్పంచ్ వీర్ల వెంకట స్వామి తదితరులు పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని రెడ్డిపాలెం పీఎం శ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో సూపర్ జీఎస్టీ 2.0 కార్యక్రమం పేరుతో వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవి నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర'లో వినుకొండకు ప్రథమ స్థానమే లక్ష్యం

▶▶ చెత్తపై పన్నువేసి ఎక్కడి వ్యర్థాలు అక్కడే వదిలేసిన ఘనత జగన్‌ది

▶▶ లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుభ్రంతో ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నాం: జీవీ

▶▶ వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద చెత్త తొలగింపును పరిశీలించిన జీవీ


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, అధికారులు

వినుకొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వినుకొండకు ప్రథమ స్థానమే లక్ష్యమని ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. మంగళవారం వినుకొండ పట్టణంలోని డిగ్రీ కాలేజ్ వద్ద ఉన్న డంపింగ్ యార్డు వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. గత వైసీపీ పాలనలో డిగ్రీ కళాశాల సమీపంలో డంపుచేసిన చెత్త తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెత్తపై పన్ను వేసి మరీ ఎక్కడి వ్యర్థాలు అక్కడ వదిలేసి రాష్ట్రాన్ని ఓపెన్ డంపింగ్ యార్డులా చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఆ దుస్థితి మార్చుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 85లక్షల మెట్రిక్ టన్నులు, వినుకొండలో 25వేల టన్నుల చెత్తను గడిచిన 15 నెలల్లో శుభ్రం చేశామన్నారు. జగన్ ప్రభుత్వం వదిలేసిపోయిన లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎరువుల తయారీ, రీసైక్లింగ్, విద్యుత్ ఉత్పత్తి ద్వారా చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నామన్నారు. సవాళ్లను అవకాశంగా మార్చుకోవడం అంటే ఇదే అని, అందుకే సీఎం చంద్రబాబుకి ఈ రోజు దేశం, ప్రపంచవ్యాప్తంగా అభినందనలు కురిపిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కనీస ఇంగితం లేకుండా డిగ్రీ కళాశాల వద్ద డంపింగ్ యార్డుపెట్టి చదువుకునే విద్యార్థుల్ని కూడా ఇబ్బందుల పాలుచేశారన్నారు. డిగ్రీ కాలేజ్, కారంపూడి రోడ్‌లో ఒకచోట, పసుపులేటి బ్రిడ్జి వద్ద మూడుచోట్ల పట్టణం మూడువైపుల చెత్తకొండలు పేర్చారని, అలాంటి వాళ్లు చెత్తపై పన్ను ఎందుకు వేశారని ప్రశ్నించారు. ఇప్పుడు వ్యర్థాల శుభ్రంలో పల్నాడు జిల్లాలోనే వినుకొండ ప్రథమ స్థానం దక్కించకోవడంపై మున్సిపల్ చైర్మన్, కమిషనర్, పారిశుధ్య సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్‌లో మొదటి స్థానం రావడం మంచి విషయమన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధించడం అందరి బాధ్యత అని అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపును అందుకొని స్వర్ణాంధ్రకు బాటలు వేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


వాల్మీకి మహర్షికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మురళి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు, వాల్మీకి సంఘం నాయకులు, బీసీ నాయకులు, కూటమి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. మాట్లాడుతూ వాల్మీకి మహర్షి పవిత్రమైన ఆలోచనలను ప్రతి ఒక్కరూ జ్ఞప్తికి తెచ్చుకుంటూ, సన్మార్గంలో నడవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఉన్నతమైన ఆదర్శభావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అన్నారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తి రాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో

నరసరావుపేట లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం రామాయణాన్ని అందించిన వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.కృష్ణారావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

భారీ వర్షంతో రోడ్లకు గండ్లు

● పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు


కోతకు గురైన ఐనవోలు - పెద్దవరం రోడ్డు

నూజెండ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఐనవోలు, పెద్దవరం రహదారి కోతకు గురై రాకపోకలు నిలిచాయి. గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండాయి. పొగాకు, మిర్చి పైర్లలో వర్షపు నీరు నిల్వటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. యోగిరెడ్డిపాలెం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి వర్షపు నీరు, బురద చేరటంతో రాకపోకలకు యోగిరెడ్డిపాలెం, లింగముక్కపల్లి, కొత్తనాగిరెడ్డిపల్లి, పాత నాగిరెడ్డిపల్లి, తంగిరాల తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో వర్షం ప్రభావానికి గురైన ప్రాంతాలను ఎంపీడీవో పీ ఉమాదేవి మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు.


నూజెండ్ల మండలంలో మిరప పైరులో నిలిచిన వర్షం నీరు

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గత రాత్రి కురిసిన వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. మాచవరం, కొత్తపల్లి గ్రామాల్లోని చప్టాలపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. కొత్తపల్లిలో బ్రిడ్జి పక్కన ఘన వ్యర్థ పదార్థాల మెడ్డు ఉంది. ఇక్కడ వేసిన చెత్త కొట్టుకువచ్చి వాగులో నీటి ప్రవాహానికి అడ్డు పడుతోంది. దీంతో నీరు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తోంది. ఎస్సీ కాలనీ సమీపంలో బ్రిడ్జి ఉంది. చిన్నారులు ఎవరైనా అటువెళితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కొత్తపల్లిలో బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన యడ్లపాడు మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని బోయపాలెం-సంగంగోపాలపురం మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదంలో మృతుని తల ఛిద్రంకావడంతో గుర్తుపట్టేందుకు వీలు లేకుండా ఉందన్నారు. చనిపోయిన వ్యక్తి పసుపు రంగు టీ షర్టు, బ్లూ నిక్కరు ధరించి ఉన్నాడని, అతనికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించామని, అనుమానాస్పద మృతిగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ శివరామకృష్ణ కోరారు.

అండర్-19 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్లు

చిలకలూరిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 బాల బాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలో పాల్గొనేందుకు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి సుమారు 80 మంది విద్యార్థులు వచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్‌ఎఫ్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకర రావు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కృపాదానం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, పీఈటీలు బి.శ్రీనివాసరావు, మున్నంగి సుబ్బారావు, కోటిరెడ్డి, నాగిరెడ్డి, రాజు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

డీఎస్సీ నూతన టీచర్లకు శిక్షణ ప్రారంభం


చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్ననూతన ఉపాధ్యాయులు

వినుకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లిలోని వివేకానంద బీఈడీ కళాశాలలో నూతనంగా డీఎస్సీకి ఎంపికైన టీచర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షణకు వచ్చిన నూతన ఉపాధ్యాయులు జీవీ ఆంజనేయులును సత్కరించారు.

శ్రీశైలం పాలకమండలి సభ్యుడు బీఎస్సార్‌కు సత్కారం


శ్రీశైలం పాలకమండలి సభ్యుడిగా ఎంపికైన బీఎస్సార్‌ను సత్కరిస్తున్న కూటమి నాయకులు

వినుకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన పారిశ్రామిక వేత్త, వినుకొండ ప్రాంతవాసి బోడెపూడి వెంకట సుబ్బారావును కూటమి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ రిటైర్డ్ మేనేజర్ జీవీ రమణారావు, శావల్యాపురం సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం, వినుకొండ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌బాబు, పట్టణ తెలుగు యువత నాయకులు నలబోతుల శ్రీనివాసరావు, బోడెపూడి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

గీతా థియేటర్‌ను పరిశీలించిన అల్లు అరవింద్


గీతా మల్టీప్లెక్స్‌ను పరిశీలిస్తున్న అల్లు అరవింద్, పక్కన గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి

నరసరావుపేట పల్నాడు రోడ్డు కాసు సెంట్రల్‌లో ఉన్న గీతా మల్టిప్లెక్స్‌ను అల్లు అరవింద్ పరిశీలించారు. థియేటర్‌లో సీటింగ్, సౌండ్ సిస్టమ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కాసు కుటుంబంతో తమ కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉందని చెప్పారు. కాసు మహేశ్‌రెడ్డి అడగటంతోనే తాను నర్సరావుపేటలో మల్టీప్లెక్స్‌ను నిర్మించానని చెప్పారు. మల్టీప్లెక్స్‌లో అధునాతన వసతులు ఉన్నాయని, ఇందుకోసం తమ మేనేజర్ బాబీ ఎంతగానో శ్రమించారని అభినందించారు. నరసరావుపేటకు మల్టీప్లెక్స్ మణిమకుటంలా ఉందని అల్లు అరవింద్ కితాబిచ్చారు. ఆయనతో పాటు గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కేవీ పురుషోత్తమ్ ఉన్నారు.

శనగ పంటకు ముందు సజ్జ పంట వేస్తే లాభదాయకం

● డాక్టర్ పీవీ సత్యనారాయణ

యడ్లపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసే శనగ పంటకు ముందు పొలాన్ని ఖాళీగా ఉంచకుండా సజ్జ పంటను సాగుచేస్తే రైతుకు ఆదాయం సమకూరడంతోపాటు భూసారం పెంపొందుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని జాలాది గ్రామంలో పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్ర దినోత్సవం, రైతు సదస్సును నిర్వహించారు. ముందుగా గ్రామంలోని రైతులు సాగుచేసిన సజ్జ పైరును ఏరువాక శాస్త్రవేత్తలతో కలసి పరిశీలించారు. అనంతరం జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతనంగా రూపొందించిన ఏబీవీ 04 సజ్జ రకం విత్తనాలను జాలాది రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఖరీఫ్‌లో వేసిన ఈ రకం ఆశాజనకమైన దిగుబడులు అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు శివన్నారాయణ, సహ పరిశోధన సంచాలకులు ఎన్‌వీఎస్‌ఎస్ దుర్గాప్రసాద్, చిరుధాన్యాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డి, రైతు ఎం.శ్రీనివాసరావు, నరసరావుపేట ఏడీఏ శ్రీనివాసరావు, డీఆర్‌సీసీ అమలకుమారి, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ నగేష్, శాస్త్రవేత్త పీవీ సత్యగోపాల్, ఏవో హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


జాలాదిలో విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన ఏబీవీ 04రకం సజ్జ పొలంను పరిశీలించిన శాస్త్రవేత్తలు

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన పల్నాడు కలెక్టర్


న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తికి పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట లీగల్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన న్యాయ అధికారి సాయి కల్యాణ్ చక్రవర్తిని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయ అధికారికి పూల మొక్కను అందజేశారు.

ఇంటర్‌సిటీ రైలుకు అనవేమా ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు వినతి


ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేస్తున్న కల్లి శివారెడ్డి, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

యడ్లపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు అనవేమా ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టాలని కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డిలు కోరారు. నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును మంగళవారం ఆయన నివాసంలో కలసి వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొండవీటి పాలకులలో సుప్రసిద్ధుడైన అనవేమారెడ్డి పేరును గుంటూరు-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరామన్నారు. అంతేగాకుండా కొండవీడుకోటలో అభివృద్ధి పనుల విషయంలో కూడా చొరవ తీసుకోవాలని, నిధుల కొరతతో నిలిచిన శివాలయం నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కోరామన్నారు. స్పందించిన ఎంపీ రైల్వే మంత్రి, రైల్వే బోర్డుతో మాట్లాడతానని, ఆయన నిర్మాణానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పాఠశాలకు వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ వితరణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

చిలకలూరిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారద జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం తోటకూర రామకోటయ్య 25వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ వారు రోటరీ, ఇన్నర్ వీల్‌ల సహకారంతో విద్యార్థులకు బోధనా పరికరాలు అందచేశారు. పాఠశాలకు రూ.4లక్షల విలువైన 50 బెంచీలు, 12 ఎస్ చైర్స్, 12 రాక్స్, 4 గ్లాస్ బోర్డులు, 25 సైన్స్ చార్టులు, 20 ప్రముఖ శాస్త్రవేత్తల ఫొటోలు అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్, ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రామినేని శివరామప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఫౌండేషన్ తరపున అందించిన రోబోటిక్స్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ రోబోటిక్స్ తరగతులతో భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునన్నారు. దాత ఆళ్ళ వెంకట్ (యూఎస్‌ఏ), తోటకూర వెంకట నారాయణ ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు.

మూడు స్కూళ్ళకు రోబోటిక్ లెర్నింగ్ ప్రోగ్రాం కిట్లు

వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, యూహెల్ప్ యూఎస్‌ఏ వారి సహకారంతో చిలకలూరిపేటలోని శారద జిల్లా పరిషత్ హైస్కూల్, పెదనందిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, ఉన్నవ జిల్లా పరిషత్ హైస్కూల్ లో రోబోటిక్ లెర్నింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ప్రతి పాఠశాలకు నిర్వాహకులు రూ. 2.75 లక్షల విలువైన రోబోటిక్ కిట్లను అందించారు. వెంకటరాయ-శ్రీధర్ ఫౌండేషన్ కార్యదర్శి తోటకూర వెంకట నారాయణ, చిలకలూరిపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరు ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రత్నజ్యోతి లతో అవగాహన పత్రాలపై సంతకం చేశారు.

సింథటిక్ ట్రాక్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తాం

● నడికట్టు రామిరెడ్డి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నడికట్టు రామిరెడ్డి, గ్రామస్థులు

నాదెండ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. చిరుమామిళ్ళలోని పాఠశాల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ట్రాక్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్‌కు సంబంధించి సివిల్ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. సుమారు రూ.50 లక్షల సొంత నిధులతో ఈ ట్రాక్‌కు నిర్మిస్తున్నామని, ఇది క్రీడాకారులకు, విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయుడు కిషోర్, యన్నం శివారెడ్డి తదితరులు ఉన్నారు.

వికసిత్ భారత్‌పై జస్టిస్ చిత్రం


వజ్రగిరి జస్టిస్ గీసిన చిత్రం

వినుకొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ చిత్రకళా క్యాంప్‌లో పట్టణానికి చెందిన చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ గీసిన చిత్రం నిర్వాహకులను, చిత్రకారుల ప్రశంసలు అందుకుంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహణలో భాగంగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్, ఐటీఐ ప్రభుత్వ కాలేజీ, విజయవాడ డ్రీమ్ వర్కర్స్ ఆర్ట్ గ్యాలరీ వారు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించారు. క్యాంప్‌లో రాష్ట్రస్థాయిలో 50మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొని వారివారి ప్రతిభను చాటుకోగా జెస్టిస్ 5 గంటలవ్యవధిలో కేవలం చాక్ పీస్, పెన్సిల్‌తో ప్రధాని మోడీ బొమ్మను అద్భుతంగా చిత్రీకరించారు. దీనిని ఎగ్జిబిషన్‌లో ఉంచగా పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జస్టిస్‌కు మెమోంటో, సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించారు. జస్టిస్ గీసిన చిత్రాన్ని ప్రధాని మోడీకి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు.